

రైతు న్యాయం
• MSP యొక్క చట్టపరమైన హామీ
• రైతులకు రుణమాఫీ
• GST రహిత వ్యవసాయం
సమ న్యాయం
• సామాజిక - ఆర్థిక కుల గణన
• 1 సంవత్సరంలోపు అన్ని FRA క్లెయిమ్ పరిష్కారం
శ్రామిక న్యాయం
• MGNREGA కింద 400 రోజువారీ వేతనం
• రూ॥ 25,00,000 వరకు ఉచిత ఆరోగ్య సంరక్షణ
మహిళా న్యాయం
• మహిళలకు 1 లక్ష వార్షిక నగదు బదిలీ
• ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 50% రిజర్వేషన్లు
యువ న్యాయం
యువతకు ఏడాదికి రూ. 1 లక్ష వేతనం ఖచ్చితమైన మొదటి ఉద్యోగం.
30 లక్షల కొత్త ప్రభుత్వ ఉద్యోగాలు
రూ. 5000 కోట్లతో కొత్త స్టార్టప్ ఫండ్
మీలాగే ఓ సామాన్య రైతు కుటుంబంలో పుట్టి...
ఓ ప్రభుత్వ ఉద్యోగస్తుని కొడుకుగా పెరిగి...
విద్యార్థి, యువజన నాయకుడిగా ఎదిగి...
ప్రజాసేవకే అంకితమైన మీ పాలమూరు బిడ్డగా
నన్ను ఆశీర్వదించండి!
మహబూబ్‌నగర్ ఎంపిగా గెలిపించండి.
హస్తం గుర్తుకు ఓటేదాం...
ఐదు న్యాయాలను గెలిపిదాం..
మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఎన్నికల నమూనా బ్యాలెట్
1
2 చల్లా వంశీచంద్ రెడ్డి
3
4
5
6
7
8
9
10
11
12
13
14
15
హస్తం గుర్తుకే మన ఓటు
పోలింగ్ తేదీ : 13 మే 2024
సమయం : ఉదయం 7 గం. నుంచి సాయంత్రం 6 గం. వరకు
- మీ చల్లా వంశీచంద్ రెడ్డి
మహబూబ్‌నగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి

## మద్యం దుకాణాలు సీజ్

ఆత్మకూరు,మే11: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శనివారం సాయంత్రం ఐదు గంటలకు ఆత్మకూరు ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలోని మూడు వైన్స్ షాపులను సీజ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే శాశ్వతంగా లైసెన్స్ రద్దు చేయడమే కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ ఎస్‌ఐ తెలిపారు. ఎన్నికల అనంతరం మళ్లీ ప్రారంభించుకోవచ్చని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ హెడ్‌కానిస్టేబుల్ ఎండి కదిర్, మహమ్మద్ పాషాలు పాల్గొన్నారు.

# పదేళ్లు వంచనకు గురిచేసిన పాలకులను శిక్షించాలి

**- ప్రముఖ సామాజిక విశ్లేషకుడు పరకాల ప్రభాకర్**


సదస్సులో మాట్లాడుతున్న ప్రముఖ సామాజిక విశ్లేషకులు పరకాల ప్రభాకర్

పాలమూరు, మే11 : పదేళ్లు వంచనకు గురి చేసిన పాలకులను శిక్షించాలని ప్రముఖ సామాజిక విశ్లేషకులు పరకాల ప్రభాకర్ ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎస్.ఎం ఫంక్షన్‌హాలులో పదేళ్ల పాలనలో 'ప్రజా జీవితం-దేశ భవిష్యత్తు' అనే అంశంపై రాజ్యాంగ పరిరక్షణ కమిటీ, తెలంగాణ ప్రజా జేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పదేళ్లుగా దేశాన్ని పాలిస్తున్న బీజేపీ భారత ప్రజలను వంచనకు గురిచేసిందన్నారు. రక్తసంబంధీకుల్లా ప్రేమగా ఉన్న భారత ప్రజల మధ్య మత చిచ్చును రేపి రక్తపాతం సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మతం మాటున నిత్యావసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచారన్నారు. బీజేపీ ఎన్నికల్లో మతాన్ని అస్త్రంగా ఉపయోగిస్తున్నారని విమర్శించారు. అటువంటి పాలకులను శిక్షించడమా.... మళ్లీ గద్దెనెక్కించడమా ప్రజల చేతుల్లోనే ఉందన్నారు. మతోన్మాదులను శిక్షించకుంటే వాళ్లు మొత్తం భారత ప్రజలను శిక్షిస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో స్త్రీలను వివస్త్రాలు చేయడం, నాగరిక సమాజానికి మాయని మచ్చగా మిగిలిందన్నారు. భారత ప్రజలు మతోన్మాదం నుంచి బయట పడితేనే రాబోయే తరాలకు ఈ దేశంలో జీవించే యోగ్యత కలిగి ఉంటుందన్నారు. ఉర్దూ పత్రిక సంపాదకులు జనాబ్ అమేర్ అలీఖాన్ మాట్లాడుతూ ఈనెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతీ ఒక్కరు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. మనం వేస్తున్న ప్రతి ఓటు దేశ భవిష్యత్తును ప్రతి ఫలిస్తుందని తెలిపారు. తెలంగాణ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ మాట్లాడుతూ దేశంలో జరుగుతున్న ఎన్నికలు రాజకీయ పార్టీల మధ్యన కాదని, నియంతృత్వ బీజేపీకి సబ్బండ భారతీయులకు మధ్య జరుగుతున్న ఎన్నికలన్నారు. తెలంగాణ ప్రజా జేఏసీ కో-కన్వీనర్ కె.రవిచంద్ర మాట్లాడుతూ భారత సమాజంలో బీజేపీ వెదజల్లిన విషం కడగడం కోసం అనేక ఏళ్లు పడుతుందన్నారు. పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ యం.రాఘవచారి మాట్లాడుతూ పదేళ్లకాలంలో ప్రజాస్వామ్యవాదులను మేధావులను నిర్బంధం ద్వారా జైల్లో పెట్టారని, ప్రజల వైపు మాట్లాడే అనేకమందిపై ఉపా కేసులు నమోదు చేశారన్నారు. సమావేశంలో టీఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎం ఖలీల్, నాయకులు హనీఫ్‌అహ్మద్, సుధాకర్, షేక్‌సిరాజ్, షేఖ్‌అబ్దుల్లా, మైలానా తాజముల్, షేక్‌అబ్దుల్లా, మౌలానా తాజముల్, జనజ్వాల, లక్ష్మణ్‌గౌడ్, గట్టన్న , మోసిన్‌పాషా ఖాద్రి, తిమ్మప్ప, శ్రీశైలం, వెంకటేశ్వర్లు, పద్మావతి పాల్గొన్నారు.

## చిన్నారి గొంతులో ఇరుక్కున్న క్యారెట్ ముక్క

**- 48 గంటలు శ్రమించి ప్రాణగండం తప్పించిన వైద్యులు**


క్యారెట్ ముక్కను తొలగించే ప్రయత్నం చేస్తున్న వైద్య బృందం

కొత్తకోట, మే 11 : ఓ చిన్నారి గొంతులో క్యారెట్ ముక్క ఇరుక్కోని ప్రాణ పాయస్థితిలో ఉండగా, వైద్యులు 48 గంటలు శ్రమించి ప్రాణగండం తప్పించిన సంఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలో చోటు చేసుకుంది. శనివారం పట్టణంలోని రాహుల్ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి డాక్టర్ హరిన్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోపి ఫిజా (3) రెండు రోజుల కిందట ఇంట్లో క్యారెట్ ముక్కను నోట్లో పెట్టుకుంది. మింగలేక పోవడంతో గొంతులోనే ఇర్కుంది. ఉపిరి ఆడక చిన్నారి అస్వస్థతకు గురైంది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం రాహుల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిశీలించి డాక్టర్ హరిన్‌రెడ్డి తన బృందంతో సీపీఆర్ చికిత్స చేశారు. నోటిలోకి గొట్టం వేసి ఆక్సిజన్ అందించారు. స్కానింగ్‌తో ఏదోముక్క చిక్కునట్లు గుర్తించారు. బ్రాంకో స్కోప్ సహాయంతో ముక్కను తొలగించి వెంటిలేటర్‌పై వైద్యం అందించారు. 48 గంటల అనంతరం ఫిజా ఆరోగ్యం మెరుగు పడడంతో శనివారం డిశ్చార్జి చేశారు. ఫిజాకు పునర్జన్మ ప్రసాదించిన చిన్నపిల్లల డాక్టర్ మనీషారెడ్డి, పల్మానాలజిస్ట్ డాక్టర్ వెంకట్‌రెడ్డిలకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

### పీవీటీజీ గురుకుల పాఠశాలలో నేరుగా ప్రవేశాలు

మన్ననూర్, మే11: మన్ననూరు ఆదివాసీ బాలుర గిరిజన గురుకుల విద్యాల యం(పీవీటీజీ)లో 2024-25 విద్యా సంవత్సరంలో 3 నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను నేరుగా భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ నిమ్మల పద్మావతి తెలిపారు. ఆసక్తి గల చెంచు విద్యార్థులు నేరుగా ప్రవేశాలు పొందాలని కోరారు.

## హత్యాయత్నం కేసులో నిందితుల రిమాండ్

**- 24 గంటల వ్యవధిలో కేసును ఛేదించిన పోలీసులు**

**- వివరాలు వెల్లడించిన ఎస్ఐ శ్రీహరి**



సోలీపూర్‌లో హత్యాయత్నం చేసిన నిందితులతో ఎస్ఐ శ్రీహరి

ఖిల్లాఘణపురం, మే11: వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలం సోలీపూర్ గ్రామంలో మంగనూరు చంద్రమ్మపై శుక్రవారం తెల్లవారు జామున హత్యాయత్నం చేసిన కేసును పోలీసులు 24 గంటల్లో ఛేదించారు. నిందితులు మీసాల బాలరాజు, మంగనూరు మహేష్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శనివారం ఎస్ఐ శ్రీహరి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మంగనూరు చంద్రమ్మపై హత్యాయత్నం చేసిన సమయంలో కుక్కలు మొరగకపోవడంతో తెలిసినవాళ్లే అఘాయిత్యానికి పాల్పడి ఉంటారనే కోణంలో దర్యాప్తు చేశారు. ఇంటి పక్కనే ఉండే పాలివాళ్లు మంగనూరు గ్యాస్ కుర్మయ్య కుమారుడు నరేష్‌కు కాలికి గాయం కావడంతో మూడు రోజుల క్రితం మృతి చెందాడు. ఆరు నెలల క్రితం గ్యాస్ కుర్మయ్య భార్య సూర్యమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. వరుసగా ఇంటిలో మరణాలు సంభవిస్తున్నాయని గ్యాస్ కుర్మయ్య కుటుంబసభ్యులు గద్దె దగ్గర విచారణ చేయగా పాలివాళ్లు చేతబడి చేస్తున్నారని తెలిపారు. దాంతో మంగనూరు చంద్రమ్మ చేతబడి చేయడం వల్లే కుటుంబంలో వరుస మరణాలు జరుగుతున్నాయని అనుమానించి కుర్మయ్య కుమారుడు మంగనూరు మహేష్ అతడి బావమరిది మీసాల బాలరాజు హత్య చేయడానికి ప్రయత్నించారు. మృతి చెందిన నరేష్ బట్టలు వేసుకుని చంపితే నరేష్ ఆత్మ సంతోషిస్తుందని మంగనూరు మహేష్‌ను కాపలా ఉంచి మద్యం మత్తులో మీసాల బాలరాజు నిద్రలో ఉన్న చంద్రమ్మ నోరు మూసి కమ్మ కత్తితో చెవి, గొంతుపై ఇష్టారీతిగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచి మృతి చెందిందని భావించి పరారయ్యాడు. దాడికి పాల్పడిన కమ్మ కత్తి, ధరించిన బట్టలను బ్యాగ్‌లో పెట్టి వనపర్తి చెరువులో పడేశారు. పోలీసులు అనుమానంతో వీరిని అదుపులోకి తీసుకొని విచారించగా చేతబడి చేసిందని చంద్రమ్మపై హత్యాయత్నం చేసినట్లు నిందితులు బాలరాజు, మహేష్ ఒప్పుకున్నారు. హత్య చేయడానికి ఉపయోగించిన కత్తిని , బట్టలను వనపర్తి చెరువు నుంచి పోలీసులు సేకరించారు. కేసును 24 గంటల్లో ఛేదించి నిందితులను అదుపులోకి తీసుకున్న కొత్తకోట సీఐ రాంబాబు, ఎస్ఐ శ్రీహరి, కానిస్టేబుల్ లింగం, ఆంజనేయులు, రమేష్, హోంగార్డు శ్రావణ్‌లను ప్రజాప్రతినిధులు, సోలీపూర్ గ్రామస్థులు అభినందించారు.

## వాహనాల తనిఖీల్లో నగదు పట్టివేత



నర్వలో పట్టుబడిన నగదుతో పోలీసులు

నర్వ, మే 11 : నారాయణపేట జిల్లా నర్వ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం చౌరస్తాలో శనివారం పోలీసులు, ఎస్ఎస్‌టీ టీమ్ సభ్యులు వాహనాలు తనిఖీ నిర్వహించారు. మహాలక్ష్మి వైన్స్‌కు చెందిన పవన్‌రెడ్డి, శంకర్‌రెడ్డిల వాహనంలో రూ. ఏడు లక్షలు నగదు పట్టుబడింది. వైన్స్ షాపునకు చెందిన డబ్బులు అని తెలిపినా ఎలాంటి రశీదు లేకపోవడంతో డబ్బులను సీజ్ చేసి గ్రీవెన్స్ సెల్‌కు పంపినట్లు నర్వ ఎస్ఐ కుర్మయ్య తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

**యన్మన్‌గండ్ల సమీపంలో...**

నవాబ్‌పేట: మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని యన్మన్‌గండ్ల సమీపంలో శనివారం ఉదయం కారులో తరలిస్తున్న సుమారు రూ. ఐదు లక్షల నగదును ఎన్నికల పరిశీలకులు స్వాధీనం చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. మండలానికి చెందిన ఓ ప్రజాప్రతినిధికి సంబంధించిన కారులో డబ్బు తరలిస్తున్నట్లు పక్కా సమాచారంతో అధికారులు దారి కాచి పట్టుకున్నట్లు తెలిసింది. అయితే కారులో డ్రైవర్ మాత్రమే ఉన్నట్లు తెలిసింది. స్వాధీనం చేసుకున్న డబ్బును జిల్లా కేంద్రానికి తీసుకెళ్లినట్లు సమాచారం. అయితే డబ్బు పట్టుబడిన విషయం వాస్తవమేనని స్థానికులు తెలిపారు. కానీ, పట్టుకున్న అధికారులు ఎవరు, పట్టుబడిన డబ్బు ఎంత అనే పూర్తి విషయాలు తెలియాల్సి ఉన్నది.

## తనిఖీల్లో మద్యం పట్టివేత

అలంపూర్ చౌరస్తా, మే 11: ఉండవల్లి మండల పరిధిలోని పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద జాతీయరహదారిపై తనిఖీలు ముమ్మరం చేశారు. శనివారం వివిధ ప్రాంతాలకు తరలిస్తున్న మద్యం పట్టుబడినట్లు ఎస్సై శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. పుల్లూరు గ్రామానికి చెందిన ఈ నరేష్‌గౌడు అనే వ్యక్తి బైక్‌పై తరలిస్తున్న 17.55లీటర్ల మద్యం విలువ రూ.14534లు, నంద్యాలకు చెందిన శివకుమార్‌రెడ్డి అనే వ్యక్తి కారులో తరలిస్తుండగా 18.100లీటర్ల మద్యం విలువ రూ. 11960లు, కర్నూలు నగరంలోని సంతోష్‌నగర్‌కు చెందిన దూదేకుల రసుల్ అనే వ్యక్తి బైక్‌పై పంటపొలాలమీదుగా కర్నూలు వైపు తరలిస్తుండగా 8.640లీటర్ల, రూ.8640లు విలువ గల మద్యం సీసాలను తనిఖీల్లో పట్టుకున్నారు. ఇక ఫ్లయింగ్ స్కాడ్ ఆధ్వర్యంలో ఉండవల్లి మండల కేంద్రంలో జె వెంకటేశ్వర్లు అనే వ్యక్తి ఇంటి సమీపంలో అక్రమంగా నిల్వ ఉంచిన 25.920లీ, విలువ రూ.27360,గల మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి లింగేశ్వరబాబు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

దేవరకద్ర, మే 11: ఎలాంటి అనుమతులు లేకుండా ఫిల్టర్ ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగన్న తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండల పరిధిలోని అడవి అజీలాపూర్ గ్రామ సమీప వాగులో ఫిల్టర్ ఇసుక తయారు చేస్తుండగా గమనించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దాంతో పోలీసులు ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.


**గుడి మల్కాపూర్ గ్రామ సమీపంలో..**

హన్వాడ: మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలంలోని గుడి మల్కాపూర్ గ్రామ సమీపంలో శనివారం తెల్లవారుజామున ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. నవాబ్‌పేట మండలం సాకల్‌పల్లి గ్రామానికి చెందిన శంకర్‌నాయక్ ట్రాక్టర్‌గా గుర్తించి అతడిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

## ఉపాధి హామీ పనుల వద్దే ప్రచారం

**- 15 రోజులుగా కూలీల వద్దకే వివిధ పార్టీల నాయకులు**

**- ముగిసిన పార్లమెంట్ ఎన్నికల ప్రచారపర్వం**


ఉపాధి కూలీల వద్ద సంక్షేమ పథకాలు వివరిస్తున్న కాంగ్రెస్ నాయకుడు మోపతయ్య

అచ్చంపేట, మే 11 : వేసవిలో రైతుల కు, రైతు కూలీలకు వ్యవసాయ పనులు లేకపోవడంతో అధికసంఖ్యలో ఉపాధి హామీ పనుల కోసం వెళ్తున్నారు. దాంతో గ్రామాలు ఉదయం సగానికి పైగా ఖాళీగా ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి వచ్చే నాయకులకు గ్రామాలలో ప్రజలు లేక బోసిపోవడం కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో గ్రామ ప్రజలు పనిచేసే చోటికే వివిధ పార్టీల నాయకులు వెళ్లి కూలీలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసుకొని ఓట్లు వేయాలని అభ్యర్థిస్తూ తమ పార్టీ అధికారంలోకి వస్తే చేయబోయ్యే మేనిఫెస్టోను వివరించారు. కొన్ని పార్టీల నాయకులు ముందస్తుగా కూలీలకు సమాచారం ఇచ్చి కూలీడబ్బులు చెల్లిస్తామని మాట తీసుకొన్నాకనే ప్రచారంలో పాల్గొంటున్నారు. ఏది ఏమైనా ఈ పార్లమెంట్ ఎన్నికల సందడి గ్రామాల్లో కనిపించనేలేదని చెప్పవచ్చు.

# అరుణమ్మ హామీకి.. మోదీ గ్యారెంటీ

- ఓటమి భయంతో కాంగ్రెస్ ఎదురుదాడి
- బీజేపీ తమిళనాడు అధ్యక్షుడు అన్నామలై
- పాలమూరులో భారీ రోడ్ షో



రోడ్‌షోలో అభివాదం చేస్తున్న అన్నామలై, డీకే అరుణ తదితరులు

మహబూబ్‌నగర్, మే 11: అరుణమ్మ హామీ ఇచ్చిందంటే అందుకు మోదీ గ్యారెంటీ ఉంటుందని, ఎందుకంటే మూడోసారి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావడం, మోదీ ప్రధానమంత్రి కావడం ఖాయమని బీజేపీ తమిళనాడు అధ్యక్షుడు అన్నామలై అన్నారు. దేశంలో బీజేపీ పదేళ్లుగా అవినీతి లేకుండా పాలన సాగిస్తుందన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో బీజేపీ నిర్వహించిన భారీ రోడ్‌షోలో ఆయన పాల్గొన్నారు. ఏనుగొండ జేజేఆర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ మెట్టుగడ్డ, బస్టాండ్ మీదుగా క్లాక్‌టవర్ వరకు చేరుకుంది. ర్యాలీలో అన్నామలై, బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. ర్యాలీలో పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో పాలమూరు ప్రధాన రహదారి కాషాయమయమైంది. క్లాక్ టవర్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో అన్నామలై మాట్లాడారు. అరుణను గెలిపించి పార్లమెంట్‌కు పంపిస్తే కేంద్ర మంత్రి అవుతారని, పాలమూరు సమస్యలకు పరిష్కారం చూపుతారని చెప్పారు. మహిళ అని కూడా చూడకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అరుణను పబ్లిక్ మీటింగ్‌లలోనే అవమానకరంగా మాట్లాడుతున్నారని, ఓటమి భయంతోనే ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నాయకులు ఎదురుదాడి చేస్తున్నారని అన్నారు. బీజేపీ కేంద్రంలో 400 సీట్లు గెలువబోతోందని, ఆ చార్ సౌ పార్‌లో పాలమూరు సీటు పక్కాగా ఉంటుందని చెప్పారు. రేవంత్‌కు గుణపాఠం చెప్పేలా బీజేపీని 4 లక్షల మెజారిటీతో గెలిపించాలన్నారు. ఎంపీ అభ్యర్థి డీకే అరుణ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఎంపీగా గెలిపిస్తే సమస్యలపై మీ గొంతుకగా పార్లమెంట్‌లో ప్రస్తావించి, పరిష్కారం కోసం కృషి చేస్తానని చెప్పారు. ఓటమి భయంతో సీఎం పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారన్నారు.

# రౌడీయిజానికి.. ఆత్మగౌరవానికి పోటీ

- ఢిల్లీ నుంచి బీజేపీ పెద్ద ఎత్తున డబ్బు సంచుల దిగుమతి
- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లావంశీచంద్‌రెడ్డి
- పాలమూరులో కాంగ్రెస్ భారీ రోడ్‌షో

మహబూబ్‌నగర్, మే 11: ఈ ఎంపీ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని దెబ్బతీయాలని గద్వాల రౌడీలు పాలమూరులో తిష్ఠ వేశారని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి ఆరోపించారు. ఈ ఎన్నికలు గద్వాల రౌడీయిజానికి, పాలమూరు ఆత్మగౌరవానికి మధ్య జరగుతున్న ఎన్నికలని చెప్పారు. ఎన్నికల్లో గద్వాల రౌడీలను తరిమికొట్టి, పాలమూరు, రేవంత్‌రెడ్డి ఆత్మగౌరవాన్ని గెలిపించాలని కోరారు. శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇక్కడ తిష్ఠవేసిన వారి లిస్టును పేర్లు, ఫోన్ నెంబర్లతో సహా ఎన్నికల అధికారికి సమర్పించబోతున్నానని చెప్పారు. ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేస్తానని తెలిపారు. ఇది రేవంత్ మీద వెన్నుపోటు కాదని, పాలమూరు భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే కుటిలమైన పన్నాగమని ప్రజలు గమనించాలన్నారు. పార్లమెంట్ పరిధిలో గద్వాల రౌడీలు ఎక్కడ కనిపించినా తరిమితరిమి కొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ విషయమై ఎన్నికల అధికారులతో పాటు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేస్తానన్నారు. గద్వాల రౌడీలను ఇక్కడి నుంచి తరిమేస్తేనే ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఇద్దరూ ఒక్కటై పాలమూరుకు వెన్నుపోటు పొడవాలని చూస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ నియోజకవర్గంలో ఎలాగైనా రేవంత్‌రెడ్డిని దెబ్బతీయాలన్న ఏకైక లక్ష్యంతో ఢిల్లీ నుంచి పెద్ద ఎత్తున డబ్బు సంచులు దించుతున్నారని ఆరోపించారు. గతంలో సారా దందాలో దిట్టైన వీళ్లు ఇవ్వాళ సారా, డబ్బును పెద్ద ఎత్తున పారించే ప్రణాళిక తయారు చేసుకున్నారన్నారు. పదేళ్లు పాలించిన బీజేపీ, బీఆర్ఎస్ ఉమ్మడి పాలమూరును తీవ్ర నిర్లక్ష్యం చేశాయన్నారు. అందుకే జిల్లా ముద్దుబిడ్డ సీఎం కావడంతో వికారాబాద్-కృష్ణా రైల్వే లైన్, మహబూబ్‌నగర్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా చేయాలని, ప్రతీ గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ రావాలని, పరిశ్రమలు నెలకొల్పాలని ప్రయత్నాలు చేస్తుంటే అభివృద్ధిని ఓర్వలేని వాళ్లు పాలమూరుకు వెన్నుపోటు పొడవడానికి చూస్తున్నారన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ఏకమై పని చేస్తున్నాయని ఆరోపించారు.



రోడ్‌షోలో అభివాదం చేస్తున్న వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

## కాంగ్రెస్ భారీ రోడ్‌షో

ఎన్నికల ప్రచారానికి చివరి రోజు కావడంతో మహబూబ్‌నగర్ పట్టణంలో కాంగ్రెస్ భారీ రోడ్‌షో నిర్వహించింది. మెట్టుగడ్డ నుంచి ప్రారంభమైన రోడ్ షో న్యూటౌన్ మీదుగా తెలంగాణ చౌరస్తా వరకు చేరింది. రోడ్ షోకు కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై బైక్ ర్యాలీ నిర్వహించారు. రోడ్ షోలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మన్నె జీవన్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, నాయకులు వినోద్‌కుమార్, ఎన్‌పీ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళ ఆత్మహత్యాయత్నం

నవాబ్‌పేట, మే 11: ప్రైవేటు బ్యాంక్ ఒత్తిళ్లకు తాళలేక నవాబ్‌పేట మండలం దర్పల్లి గ్రామానికి చెందిన బాలమణి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబీకుల వివరాల ప్రకారం.. బాలమణి ఇంటి పేరుమీద కూతురు నర్సమ్మ పాలమూరులోని ఓ ప్రైవేట్ బ్యాంకులో రూ.తొమ్మిది లక్షల రుణం తీసుకుంది. వాయిదాలు చెల్లింపులో జాప్యం జరగడంతో బ్యాంకు అధికారులు బాలమణి ఇంటికి వచ్చి, ఒత్తిడి చేశారు. బాలమణి కూతురుకు తెలిపినా స్పందించకపోవడంతో శనివారం పురుగుల మందు తాగింది. జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్యులు తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరికలు



ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన మున్ననూర్ గ్రామస్థులు

రాజాపూర్, మే 11 : మండలంలోని ముదిరెడ్డిపల్లి గ్రామ తాజా మాజీ సర్పంచ్ పెంటయ్యతో పాటు, గ్రామ ముదిరాజ్ సంఘం సభ్యులు కొందరు శనివారం ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరార. జడ్చర్లలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మాజీ సర్పంచ్ పెంటయ్యకు, ముదిరాజ్ సంఘం గ్రామ ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్‌రెడ్డి, అంజనేయులు, మల్లేష్, రాఘవేందర్, శ్రీనివాస్ గౌడ్, నరేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● నవాబ్‌పేట : మండలంలోని రేకుల చౌడాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో సుమారు 50 నాయకులు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రతీ కార్యకర్త ఈ ఎన్నికల్లో సైనికుడిలా పని చేయాలని కోరారు. గ్రామాభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని తెలిపారు. పార్టీలో కలిసిన వారిలో నాయకులు తేజ నాయక్, గోపాల్, శంకర్, శ్రీను, పెంట్యానాయక్, సార్య నాయక్, గోపాల్ నాయక్, వినోద్ రాజేష్, రమేష్, రాము, నరేష్ పాల్గొన్నారు.

● మిడ్జిల్ : మండలంలోని మున్ననూర్ గ్రామానికి చెందిన పలు పార్టీల నాయకులు శనివారం ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డికి ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. నాయకులు మల్లికార్జున్‌రెడ్డి, వెంకటయ్య, రాఘవరెడ్డి, జంగయ్య ఉన్నారు.

## అన్ని మతాలను గౌరవించే ప్రభుత్వం రావాలి

**- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి**



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

పాలమూరు, మే 11 : అన్ని మతాలను గౌరవించే ప్రభుత్వం రావాలని దైవ సేకులు ప్రార్థించాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలో దాసరి సహోదరుల ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా క్రైస్తవ సేవలకు కూడికకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. క్రైస్తవ సేవకులు ప్రపంచ శాంతి కోసం ప్రార్థనలు చేస్తారన్నారు. ఆ యేసు ప్రభు మార్గంలో మీరు నడుస్తారని, శాంతి సమాధానం, ప్రేమ స్నేహభావం మీలో ఉంటుందన్నారు. మంచిని ప్రేమించే మీరు మంచి ప్రభుత్వం అధికారంలోకి రావాలని ప్రార్థించాలన్నారు. మణిపూర్‌లో జరిగిన సంఘటనను జ్ఞాపకం చేసుకుని, మా పార్టీ దేశ ప్రధాని కావాలని ప్రార్థన చేయాలన్నారు. కార్యక్రమంలో దాసరి సుందర్, ఆర్.జాన్, అనుమంతరావు, అబ్రహాం, జాన్సన్‌పాల్, విజయభాస్కర్, ప్రేమరాజు, ఆర్.ప్రసాద్, ప్రభాకట్, అభిషేక్, మోష, జ్యోతికుమార్, వేణు, ప్రకాష్‌రాజ్, సాంసోన్, రాజు, పాస్టరమ్మలు, క్రైస్తవ నాయకలు ప్రసాద్, ప్రవీణ్, రవికిరణ్ పాల్గొన్నారు.

## ఎన్నికల విధుల్లో పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

**- ఎస్పీ హర్షవర్ధన్**



మహబూబ్‌నగర్ పట్టణంలో నిర్వహించిన ఫ్లాగ్‌మార్చ్‌లో పాల్గొన్న ఎస్పీ హర్షవర్ధన్

మహబూబ్‌నగర్, మే 11 : పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్‌శాఖ అన్ని రకాల చర్యలు తీసుకుందని, ఎన్నికల సమయంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ హర్షవర్ధన్ పోలీసులకు పిలుపునిచ్చారు. ప్రజల్లో ఎన్నికలపై ఆత్మవిశ్వాసం కలిగేంచేందుకు సీఐఎస్ఎఫ్ సాయుధ బలగాలచే శనివారం పట్టణంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 13న జరిగే పోలింగ్ సందర్భంగా ఈవీఎంల తరలింపు, పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు, తిరిగి ఈవీఎంలు స్ట్రాంగ్ రూమ్ చేరేవరకు ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలింగ్ స్టేషన్‌ల వద్ద 144 సెక్షన్ ఉంటుందని, 100మీ దూరంలో ఎవరూ గుంపులుగా ఉండకుండా చూసుకోవాలని తెలిపారు,

### ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి : ఎస్పీ

దేవరకద్ర, మే 11 : దేవరకద్ర నియోజకవర్గ పరిధిలో పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతీ ఒక్కరు సహకరించాలని ఎస్పీ హర్షవర్ధన్ సూచించారు. శనివారం మండల పరిధిలోని చౌదర్‌పల్లి స్టేజీ దగ్గర ఉన్న శ్రీ విశ్వేశ్వరయ్య ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీఐ రామకృష్ణ, ఎస్ఐ నాగన్న, వివిధ మండలాల ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

## చిన్నచింతకుంటలో సీపీఐ కార్యకర్తల ప్రచారం

చిన్నచింతకుంట, మే 11 : మండల కేంద్రమైన చిన్నచింతకుంటలో శనివారం కాంగ్రెస్ పార్టీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా సీపీఐ నాయకులు ప్రచారం చేశారు. సీపీఐ దేవరకద్ర నియోజకవర్గ కార్యదర్శి భార్గవి, నాయకులు శ్రీనివాసులు, అమరజ్యోతి, మాసన్న ఆధ్వర్యంలో గ్రామంలో కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 13న జరిగే పోలింగ్‌లో వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలని, కరపత్రాలను పంచుతూ ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు లక్ష్మి, జయమ్మ, మనెమ్మ, ఎల్లమ్మ, సవారన్న, రవి తదితరులు పాల్గొన్నారు.

## అమర్‌రాజా బ్యాటరీ కంపెనీని తరలించాలి

**- ఎదిరలో దేవాలయాలు, మసీదు, చర్చిల్లో ప్రార్థనలు చేసి నిరసన**

మహబూబ్‌నగర్ అర్బన్, మే 11 : కాలుష్యాన్ని వెదజల్లే అమరరాజా బ్యాటరీ కంపెనీని ఇక్కడి నుంచి తరలించాలని శనివారం ఎదిర నాలుగవ వార్డులో అమర్‌రాజా బ్యాటరీ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో సర్వమత ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామి దేవాలయం, జామియా మసీదు, చర్చిలో ప్రార్థలు నిర్వహించారు. గ్రామదేవతలు, దర్గాలో పూజలు నిర్వహించి, దేవుళ్ల ముందు వినతి పత్రాలు ఉంచి నిరసన తెలిపారు. కొబ్బరి కాయలు కొట్టారు. పోరాట సమితి సభ్యులు మాట్లాడుతూ స్వచ్ఛందంగా 57 రోజులుగా అమర్‌రాజా కంపెనీకి వ్యతిరేకంగా దీక్షలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో శివశంకర్, సుధానర్సింహులు, వెంకటయ్యగౌడ్, అల్లీ ఎల్లయ్య, కృష్ణ వెంకటేశ్, అమర్‌నాథ్‌రెడ్డి, భానుచందర్, అజీజుల్లా, సత్యం, శ్రీనివాస్‌రెడ్డి, నాగరాజు, ఆంజనేయులు, శ్రీనివాస్, ఎం.నరసింహులు, ధనుంజయ, సుబహన్, గిరి, సిరాజ్, శంకర్, తిరుపతయ్య, శేఖర్, నాని, రవి, శ్రీశైలం, దేవేందర్, లక్ష్మణ్, శ్రీను పాల్గొన్నారు. గ్రామపెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## ఉత్తరాధిమఠం అడ్‌హక్ కమిటీ ఎన్నిక

**- అధ్యక్షుడిగా జోషి సంతోషాచార్య**

మహబూబ్‌నగర్ టౌన్, మే 11 : స్థానిక ఉత్తరాధిమఠంలో శనివారం శ్రీ పరశురామ బ్రాహణ అర్చక పురోహిత సంఘం సమావేశం ఏర్పాటు చేసి అడహక్ కమిటీ ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా జోషి సంతోషాచార్య, ఉపాధ్యక్షులుగా సుధీంద్రా చార్య, డీఎం రాఘవేందర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా జోషి ప్రదీపాచార్య సహాయ కార్యదర్శిగా కొల్లూరు పవమానాచార్య సహాయ కోశాధికారిగా జయతీర్థాచార్యలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పండితులు, వివిధ ప్రాంతాల పురోహితులు, అర్చకులు పాల్గొన్నారు. సమష్టి కృషితో ధార్మిక కార్యక్రమాలు చేస్తామని అధ్యక్షుడు జోషి సంతోషాచార్య తెలిపారు.

# రేపటి పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

**- నోటాతో 32 మంది బరిలోని అభ్యర్థులు**
**- రెండు ఈవీఎంల ఏర్పాటు**
**- పార్లమెంట్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 16,82,470.**
**- పోలింగ్ కేంద్రాలు 1937**
**- ఎస్పీ హర్షవర్ధన్‌తో కలిసి వివరాలు వెల్లడించిన కలెక్టర్ రవి నాయక్**




మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న కలెక్టర్ జి. రవినాయక్, ఎస్పీ హర్షవర్ధన్

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), మే 11 : మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఈ నెల 13న జరగనున ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ జి. రవి నాయక్ చెప్పారు. ఎన్నికల నేపథ్యంలో శనివారం ఆయన ఎస్పీ హర్షవర్ధన్‌తో కలిసి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు.పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు సెగ్మెంట్లను కలుపుకొని 1937 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతీ పోలింగ్ కేంద్ర రెండు కిలో మీటర్ల దూరంలో ఉండేలా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం ఓటర్లు 16,82,470 మందితో పాటు అదనంగా సర్వీస్ ఓటర్లు 1239 మంది ఉన్నట్లు చెప్పారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో విద్యుత్, ర్యాంప్స్, ఫర్నీచర్, తాగునీరు, టాయిలెట్స్ వంటివి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో వెబ్‌క్యాస్టింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శనివారం సాయంత్రం ఆరు గంటల నుంచి అన్ని టీమ్‌లను యాక్టివ్ చేశామన్నారు. ఎన్నికల బరిలో 31 మంది ఉన్నారని, నోటాతో కలుపుకొని 32 మంది అవుతారన్నారు. పోలింగ్‌కు 48 గంటల ముందు నుండి ఎలాంటి లౌడ్ స్పీకర్లు, సమావేశాలు, ప్రచారాలకు అనుమతి లేదన్నారు. కేవలం అభ్యర్థులు మాత్రమే ఇంటింటి తిరిగి ప్రచారం చేసుకోవచ్చని తెలిపారు. అనుమతులను పొందే సువిధ యాప్ బంద్ అయ్యిందన్నారు. ఫిర్యాదులకు సి-విజిల్ యాప్ కొనసాగుతుందన్నారు. అభ్యర్థులు ఏమైనా యాడ్స్ వేసుకోవాలనుకుంటే ఎంసీఎంసీ కమిటీ ద్వారా అనుతి తీసుకోవాలన్నారు. 1 నుంచి 16 నంబర్ వరకు ఫస్ట్ ఈవీఎం, 17 నుంచి 32 వరకు రెండవ ఈవీఎంలను వినియోగించుకోవచ్చని తెలిపారు. పోలింగ్ సమయంలో ఎలాంటి ఇబ్బంది కాకుండా 25 శాతం చొప్పున వీవీప్యాట్లు, 40 శాతం ఈవీఎంలను అదనంగా రిజర్వ్‌గా ఉంచినట్లు తెలిపారు ఇప్పటికే 95 శాతం ఓటర్ స్లిప్పులను పంపిణీ చేశామని వివరించారు. ఓటర్ ఐడీ కార్డు లేకపోతే ఓటర్ స్లిప్‌తో పాటు ఎన్నికల సంఘం సూచించిన 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదేని ఒకటి తీసుకవెళ్లాలని సూచించారు. ఎస్పీ హర్షవర్ధన్ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిసేందుకు గాను ఎనికల కమిషన్ జారీ చేసి నియమ నిబంధనల మేరకు గట్టి భద్రతా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోలింగ్ రోజు అన్ని పోలింగ్ కేంద్రాలలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. సమస్యాత్మకమైన 58 పోలింగ్ కేంద్రాలను గుర్తించి, ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా పరిధిలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు రూ.2 కోట్ల 30 లక్షల నగదు, 20 వేల 600 లీటర్ల మద్యాన్ని సీజ్ చేసినట్లు ఆయన వివరించారు.

# బీజేపీ వస్తే రిజర్వేషన్ల తొలగింపు ఖాయం

**- భూత్పూర్ మునిసిపాలిటీలో తైబజార్‌ను రద్దు చేస్తాం**
**- మండలానికి 100 ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం**
**- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర/ భూత్పూర్/ చిన్నచింతకుంట/ అడ్డాకుల, మే 11 : ఈ సారి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీల రిజర్వేషన్ల తొలగించడం ఖాయయని ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా దేవరకద్ర నియోజకవర్గంలో పర్యటించారు. దేవరకద్ర మండల గద్దెగూడెం గ్రామం, భూత్పూర్ మునిసిపాలిటీ పరిధిలోని అమిస్తాపూర్, భూత్పూర్ గ్రామాలు, చిన్నచింతకుంట మండలం ఎమ్మెల్యే స్వగ్రామమైన దమాగ్నాపూర్ ప్రచారం నిర్వహించారు. అడ్డాకుల బస్టాండ్ కూడలిలో రోడ్డుషో నిర్వహించారు. ఆయా గ్రామాల్లో జరిగిన సమావేశాల్లో ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడారు. కార్పొరేట్ బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించితేనే దేశానికి దేశ సంపదకు రక్షణ ఉంటుందన్నారు. పార్లమెంటు ఎన్నికలు అయిన వారంరోజుల్లోనే భూత్పూర్ మునిసిపాలిటీ పరిధిలో ఉన్న తైబజార్‌ను రద్దు చేస్తామని అన్నారు. అదే విధంగా మండలంలో 100 ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. 60 ఏళ్లు దాటిన రైతులకు పింఛన్ వంటి పథకాలను అమలు చేయలేదని, ప్రజలకు, రైతులకు బీజేపీపై నమ్మకం లేదన్నారు. ప్రతీ ఒక్కరు కాంగ్రెస్ వైపు మొగ్గుచూపుతున్నారని అన్నారు. కాంగ్రెస్ వస్తేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రజలు హస్తం గుర్తుకుఓట్లు వేసి ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. దేవరకద్రలో మండల అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, నాయకులు లక్ష్మీకాంత్‌రెడ్డి, హన్మంతురెడ్డి, కొండ శ్రీను, జఫార్, గోపాల్, చెన్నయ్య, రాజేశ్వర్, నాయకులు, యువకులు, భూత్పూర్ ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నవీన్‌గౌడ్, నాయకులు మాజీ జడ్పీటీసీ రామన్‌గౌడ్, నాయకులు పవన్‌కుమార్, మట్టి ఆనంద్, మాజీ సర్పంచులు హర్యానాయక్, చెన్నమ్మ, కొండయ్య, చిన్నచింతకుంట మండలంలో వట్టెం శివకుమార్, అమరేష్ మాజీ సర్పంచ్ హన్మంతురెడ్డి, రవిగౌడ్, అడ్డాకులలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొండా జగదీశ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీహరి, ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి విజయమోహన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ బాల్‌నర్సింహులు పాల్గొన్నారు.

# వ్యక్తిగత విమర్శలకే పరిమితమైన కాంగ్రెస్, బీజేపీ

**- ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్**



క్లాక్‌టవర్‌లో వీధివ్యాపారుల మద్దతు కోరుతున్న ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్, మే 11 : కాంగ్రెస్, బీజేపీలు ఒకరిపై ఒకరు వ్యక్తిగత విమర్శలు చేసుకోవడం తప్ప పాలమూరు అభివృద్ధి కోసం ఏం చేస్తారో చెప్పడం లేదని, అందుకే ఈ రెండు పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ అభ్యర్థి, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి ఓటర్లకు పిలుపునిచ్చారు. శనివారం మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి పట్టణంలోని గడియారం చౌరస్తాలో వీధివ్యాపారుల వద్దకెళ్లి బీఆర్ఎస్‌కు ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం క్లాక్‌టవర్ చౌరస్తాలో కార్నర్ మీటింగ్‌లో ప్రసంగించారు. ఎంపీగా తను ఐదేళ్ల కాలంలో కేంద్రం నుంచి ఎన్నో నిధులు తీసుకొచ్చానని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సారధ్యంలో పాలమూరు పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు. మరోసారి తనకు అవకాశం కల్పిస్తే పాలమూరు అభివృద్ధి కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 50 ఏళ్ళ అభివృద్ధి వెనక్కి పోయే పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. తాను భూములు కబ్జా చేస్తున్నానని, కేసులు పెడుతున్నానని, బెదిరిస్తున్నానని ఎన్నికల్లో తప్పుడు ప్రచారం చేసి గెలిచారని, ఇప్పుడు కూడా గ్రామాలకు, వార్డులకు ఏం చేస్తారో చెప్పకుండా ఇంకా తనపై తప్పుడు ప్రచారం చేయడమే పనిగా పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా వ్యక్తిగత ఆరోపణలు మాని పాలమూరు అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరారు. లోకల్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించి పాలమూరు అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోరమోని నర్సింహులు, గంజి ఎంకన్న, కోరమోని వెంకటయ్య, కట్టా రవికిషన్‌రెడ్డి, రాము, గణేష్, శ్రీనివాస్, శివరాజు పాల్గొన్నారు.

### ఓటు ద్వారా కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పండి : మాజీ ఎమ్మెల్యే ఆల

భూత్పూర్, మే 11 : జుటాకోరు కాంగ్రెస్ పార్టీకి సరిన బుద్ధి చెప్పాలంటే ఓటు అనే యాదం ఒక్కటేనని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి మద్దతుగా శనివారం మునిసి పాలిటీలోని అమిస్తాపూర్ గ్రామంలో బహిరంగ సామావేశంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు మాసాలు కావస్తున్న ఆరుగ్యారంటీల హామీల్లో ఏ ఒక్కటి కూడా అమలు చేయలేక పోయిందని విమర్శించారు. ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ బస్వరాజుగౌడ్, వార్డు కౌన్సిలర్లు శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణ, బాల్‌కోటీ, కృష్ణవేణి, కో-ఆప్షన్ సభ్యుడు అజ్జుభాయ్, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బాలస్వామి, నాయకులు మూసా సాయిలు, ఆగిరి వెంకటేష్, మాజీ సర్పంచ్‌లు నారాయణగౌడ్, సత్యనారాయణ, మేకల సత్యనారాయణ పాల్గొన్నారు.

# జిల్లా క్రీడాకారులు రంజీకి ఎంపికవ్వాలి

**- ఎండీసీఏ చీఫ్ ప్యాట్రన్ మనోహర్‌రెడ్డి**



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న దృశ్యం

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, మే 11 : క్రికెట్‌లో జిల్లా క్రీడాకారులు రంజీ జట్టుకు ఎంపికకావాలని జిల్లా క్రికెట్ అసోసియేషన్ చీఫ్ ప్యాటన్ మనోహర్ రెడ్డి అన్నారు. శనివారం ఎండీసీఏ మైదానంలో మహబూబ్‌నగర్, గద్వాల జట్ల మధ్య మ్యాచ్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, క్రీడాస్ఫూర్తిని చాటాలన్నారు. మహబూబ్‌నగర్ క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ రాజశేఖర్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో క్రికెట్ అసోసియేషన్ సహకారంతో జిల్లా క్రికెట్ సంఘ ఆధ్వర్యంలో గ్రామీణ ఔత్సాహిక క్రీడాకారులను ప్రోత్సహించేందుకుగాను ఉమ్మడి జిల్లాలో ఆరు చోట్ల శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ శిబిరాల్లో రాణించే క్రీడాకారులకు హెచ్‌సీఏ క్రీడాపోటీలకు ఎంపిక చేసే అవకాశాలు ఉంటాయని అన్నారు. మహబూబ్‌నగర్, జడ్చర్ల, కోస్గి, కల్వకుర్తి, గద్వాల, నాగర్‌కర్నూల్ శిక్షణ శిబిరాల్లో నిష్ణాణతులైన శిక్షకుల చేత శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండీసీఏ సభ్యులు సురేష్‌కుమార్, కృష్ణమూర్తి, కోచ్ మన్నాన్ పాల్గొన్నారు.

● 31 పరుగులతో తేడాతో మహబూబ్‌నగర్ గెలుపు : ఎండీసీఏ మైదానంలో జరిగిన లీగ్ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ జట్టు 31 పరుగుల తేడాతో గద్వాల జట్టుపై గెలిచింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన మహబూబ్‌నగర్ జట్టు 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 216 పరుగులు చేసింది. జట్టులో గణేష్ 67 పరుగులు చేసి అర్ధసెంచరీ చేయగా, హర్ష 45, డేవిడ్ 33,అబ్దుల్ రఫె 24 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన గద్వాల జట్టు 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 185 పరుగులు చేసి ఓటమిపాలైంది. జట్టులో అరవింద్ 54 పరుగులు చేసి అర్ధసెంచరీ చేయగా, శరత్ 30, జయసింహ 25 పరుగులు చేశారు.

## మార్కెట్లోకి న్యూఎపిక్ స్విఫ్ట్ కారు విడుదల




న్యూఎపిక్ స్విఫ్ట్ కారును మార్కెట్లోకి విడుదల చేస్తున్న సినీ నిర్మాత హర్షిత్‌రెడ్డి

పాలమూరు, మే 11 : వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా మారుతీ కార్ల సంస్థ ప్రతీసారి నూతన కార్లను మార్కెట్లోకి విడుదల చేస్తోంది. అందులో భాగంగానే శనివారం మారుతీ షోరూం శ్రీ జయరామ మోటార్స్‌లో ప్రముఖ సినీ నిర్మాత హర్షిత్‌రెడ్డితో కలిసి జయరామ అధినేత బెక్కరి రాంరెడ్డి మార్కెట్లోకి న్యూఎపిక్ స్విఫ్ట్ కారును విడుదల చేశారు. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఈ న్యూ ఎపిక్ స్విఫ్ట్ కారు 1197సీసీ ఇంజిన్‌తో సరికొత్త జెడ్ సీరిస్(జెడ్12ఈ ఇంజిన్), రియర్ ఏసీ వెంట్స్ 6ఎయిర్ బ్యాగ్స్, పెట్రోల్ వెర్షన్‌లో 25.75 కిలోమీటర్ల మైలేజీ, న్యూ సస్పెన్షన్, డిజిటల్ ఏసీ ప్యానెల్ 3డీ టెక్చర్, 6రంగులలో లభిస్తుందన్నారు. కారు ఎక్స్ షోరూం ధర రూ.6.49లక్షల నుండి రూ.9.64లక్షల వరకు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సీఈవో విక్రమ్, జనరల్ మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి, డిజిటల్ మేనేజర్ పార్థసారథి, సంస్థ సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

## ఇసుక లారీ ఢీకొని వ్యక్తి మృతి

**- భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఘటన**

కృష్ణకాలనీ (భూపాలపల్లి), మే 11 : భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మంజూర్‌నగర్‌లో సింగరేణి ఆస్పత్రి ఎదుట శనివారం సాయంత్రం ఇసుక లారీ ఢీకొని మహబూబ్‌నగ్ జిల్లా మూసాపేట వాసి మృతిచెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి జిల్లా మహ దేవపూర్ మండలం కాళేశ్వరం నుంచి ఇసుక లోడ్‌తో పరకాల వైపు వెళ్తున్న లారీ అదుపు తప్పి భూపాలపల్లిలోని సింగరేణి ఆస్పత్రి ఎదుట బస్‌షెల్టర్ వద్ద బస్సు కోసం వేచి ఉన్న ప్రయాణికులపై దూసుకెళ్లింది. దీంతో మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట గ్రామానికి చెందిన వాకటి సత్యనారాయణ (30) అక్కడికక్కడే మృతి చెందాడు. ఇతను భూపాలపల్లి జిల్లా గణపురం మండలం బస్వరాజ్‌పల్లి సమీపంలోని సింగరేణి కేటీకే-3 ఓపెన్‌కాస్టులో ఎస్‌వీ ఇంజనీరింగ్ కంపెనీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. సంఘటన స్థలాన్ని సీఐ నరేష్‌కుమార్, ఎస్సైలు సుధాకర్, సంధ్యారాణి పరిశీలించి కేసు నమోదు చేశారు.

## ఎన్నికల సిబ్బందికి మూడవ విడత ర్యాండమైజేషన్ పూర్తి

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్) మే 11 : పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో భాగంగా శనివారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ సమావేశ మందిరంలో పోలింగ్ సిబ్బందికి మూడవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ జరిగింది. ఈ ప్రక్రియ కేంద్ర ఎన్నికల సాధారణ పరిశీలకుడు షెవాంగ్ గ్యాచో భూటియా సమక్షంలో మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర నియోజకవర్గాలకు సంబంధించి పోలింగ్ సిబ్బందిని, సూక్ష్మ పరిశీలకులను ఎంపిక పూర్తయ్యింది. అలాగే నారాయణపేట జిల్లాకు సంబంధించి మక్తల్, నారాయణపేట నియోజకవర్గాలకు సంబంధించి పోలింగ్ సిబ్బంది, సూక్ష్మ పరిశీలకులను ఆయా పోలింగ్ కేంద్రాలకు ఎంపిక చేశారు. ఈ ర్యాండమైజేషన్ కార్యక్రమానికి ఎన్నికల అధికారి, కలెక్టర్ జి. రవికుమార్, నారాయణపేట కలెక్టర్ కోయ శ్రీహర్షలు హాజరయ్యారు. జరిగింది. కార్యక్రమంలో జిల్లా సమాచార శాఖ అధికారు సత్యనారాయణ మూర్తి, మ్యాన్ పవర్ నోడల్ అధికారి ప్రవీణ్ ఉన్నారు.

## ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేయాలి

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), మే 11 : ఓట్ల లెక్కింపు కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కేంద్ర ఎన్నికల సాధారణ పరిశీలకులు షెవాంగ్ గ్యాచో భూటియా అన్నారు. మహబూబ్‌నగర్ లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల లెక్కింపు కేంద్రాని, స్ట్రాంగ్ రూమ్‌ల ఏర్పాట్లు పాలమూరు యూనివర్సిటీలో జరుగుతున్న నేపథ్యంలో ఆయన శనివారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌తో కలిసి కౌంటింగ్ కేంద్రాలను, స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్కింగ్ సదుపాయాలతో పాటు భద్రతా పరమైన అంశాలపై పలు సూచనలు చేశారు. లెక్కింపు టేబుళ్ల కూర్పు, అధికారులు, అభ్యర్థులు, ఏజెంట్ల ప్రవేశం, ఈవీఎంల కదలికలపై సూచనలు ఇచ్చారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సీసీ కెమెరాలు, బారికేడ్లు, లైటింగ్, పార్కింగ్, మీడియా సెంటర్ తదితరవంటి అన్ని వసతులు ఏర్పాట్లు చేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు చేపట్టిన చర్యలను పరిశీలించారు. ఈవీఎం భద్రతకు ర్యాకులు పరిశీలించారు. జనరేటర్ సదుపాయం ఉండాలన్నారు. అంబులెన్స్ అందుబాటులో ఉంచాలని సూచించారు. ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారి పరిశీలకులకు మరిన్ని విషయాలని వివరించారు.

## యువత క్రీడల్లో రాణించాలి

గండీడ్, మే 11 : యువత క్రీడల్లో రాణించాలని ముదిరాజ్ సంఘం మండల ఉపాధ్యక్షుడు అంజనేయులు అన్నారు. శనివారం మండల పరిధిలోని సాలార్‌నగర్ గ్రామంలో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు దురలవాట్లకు, మొబైల్‌కు దూరంగా ఉండాలని సూచించారు. యువత క్రీడల్లో రాణిస్తే శారీరకంగా, దృఢంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం గ్రామ కమిటీ అధ్యక్షుడు నరేష్, సిద్ధు, రాఘవేందర్, చందు, మహేందర్, యువకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఓటర్లకు భరోసా కల్పిస్తూ పోలీసుల కవాతు

మిడ్జిల్, మే 11 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లు నిర్భయంగా ఓటు వేసేందుకు భరోసా కల్పిస్తూ పోలీసులు మండల కేంద్రంలో కవాతు నిర్వహించారు. మండలంలోని వీధులగుండా ఏఆర్ అడిషనల్ ఎస్పీ సురేష్‌కుమార్, సీఐ నాగార్జునగౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించారు. ప్రజలందరూ స్వచ్ఛందంగా ఓటు వేయాలని, ప్రతీ ఒక్కరు ఓటు వేయాలని, ప్రజాశాంతికి విఘాతం కలిగించే వారిపై ఇప్పటికే దృష్టి సారించామని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పర్వతాచారీ, విష్ణువర్ధన్‌గౌడ్ఉన్నారు.

## బీఆర్ఎస్‌లో చేరిన కౌన్సిలర్ కోట్ల నర్సింహా



తిరిగి పార్టీలో చేరిన కోట్ల నర్సింహను స్వాగతిస్తున్న మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి

మహబూబ్‌నగర్, మే 11 : బీఆర్ఎస్ నుంచి గెలుపొందిన 34వ వార్డు కౌన్సిలర్ కోట్ల నర్సింహ ఇటీవల ఆ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. శనివారం ఆయన తిరిగి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మాజీమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో కౌన్సిలర్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీమంత్రి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

## రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేస్తున్న మోదీ

**- తెలంగాణ జాగో-తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక**

పాలమూరు, మే 11 : రాజ్యాంగ వ్యవస్థలు, విలువలను ప్రధాని మోదీ ధ్వంసం చేస్తున్నారని తెలంగాణ జాగో-తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక ప్రతినిధులు అన్నారు. బీజేపీ ఓడిపోయే దశలో ముస్లిం వ్యతిరేక ఉన్మాదాన్ని రెచ్చగొట్టడం దుర్మార్గమైందని అన్నారు. శనివారం ఉదయం జిల్లా కేంద్రంలో మార్నింగ్ వాకర్స్‌తో మాట్లాడారు. ప్రజావ్యతిరేక మోదీ ప్రభుత్వాన్ని ఓడించాలని తెలంగాణ జాగో-తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక పిలుపునిచ్చింది. తెలంగాణజాగో- తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక(టీఎస్‌డీఎఫ్) ఆధ్వర్యంలో చేపట్టిన ఓటరు చైతన్య యాత్ర 10వ రోజు శుక్రవారం మహబూబ్‌నగర్‌కు చేరుకుంది. మోదీ భక్తులు మీటింగ్‌ను అడ్డుకునే ప్రయత్నం చేసినా సభను పూర్తి చేశారు. కార్యక్రమంలో టీఎస్‌డీఎఫ్ చైర్మన్ జస్టిస్ చంద్రకుమార్, మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళి, సీపీఐ(ఎం.ఎల్)మాస్‌లైన్ ప్రతినిధులు ప్రసంగించారు. పదేళ్లకాలంలో కార్మిక, వ్యతిరేక, రైతు వ్యతిరేక, యువజన వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగ విలువలను మోడి ధ్వంసం చేస్తున్నారని తెలిపారు. రూ.15లక్షలు, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఓడిపోయే దశలో ముస్లిం వ్యతిరేక ఉన్మాదాన్ని రెచ్చగొడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో పి.అరుణ్‌కుమార్, సి.వెంకటేష్, ప్రొ.లక్ష్మీనారాయణ, గోవర్ధన్, మహేష్, ప్రదీప్, తిరుపతి, రచయిత స్కైబాబు, స్వరూప, కల్పనలు యాత్రలో పాల్గొన్నారు.

## కాషాయ జెండాల తొలగింపుపై ఆగ్రహం

చిన్నచింతకుంట, మే 11 : మండల కేంద్రమైన చిన్నచింతకుంటలోని కూడళ్లు, రహదారి వెంట ఏర్పాటుచేసిన కాషాయ జెండాల తొలగింపుపై హిందూ సంఘాలు ఆందోళన చేశాయి. కొన్నాళ్ల క్రితం అయోధ్యలోని శ్రీరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా మండలకేంద్రంలో కాషాయ జెండాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల నిబంధనల పేరుతో వాటిని స్థానిక గ్రామ పంచాయతీ సిబ్బంది తొలగించటంపై శనివారం రాత్రి బీజేపీ, వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్, బజరంగ్‌దళ్ కార్యకర్తలు బస్టాండు కూడలిలో ఆందోళన చేపట్టారు. గ్రామ పంచాయతీ సిబ్బంది ఎన్నికల నిబంధనల పేరుతో తొలగించటం సరైంది కాదని ఆందోళన కారులు అన్నారు. ఆత్మకూర్, హైదరాబాద్ ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. బీజేపీ ననియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ కుర్వ రమేష్, నాయకులు కృష్ణ, డాక్టర్ రాము, బాలన్న, మహేష్, వడ్ల నర్సింహులుతో పాటు 50 మంది పాల్గొన్నారు.